క్లుప్తంగా

7న టెన్త్ విద్యార్థులకు ప్రతిభ పరీక్ష

శావల్యాపురం: పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 7న ప్రతిభ పరీక్ష నిర్వహించనున్నట్లు సుచరిత ఏడ్యూకేషనల్ సొసైటీ కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్ చందు తెలిపారు. గురువారం స్థానిక శ్రీరామా పబ్లిక్ స్కూల్లో ఆయన మాట్లాడుతూ గంగినేని ఫౌండేషన్, సుచరిత ఏడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిభ పరీక్ష స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతుందన్నారు. పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థుల భయాన్ని పోగొట్టేందుకు ఈ పరీక్ష దోహదపడుతుందన్నారు. గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్ట్‌లలో డిసెంబరు నెల వరకు జరిగిన సిలబస్ నుంచి 100 మార్కుల మల్టీపుల్ చాయిస్ ప్రశ్న పత్రం ఉంటుందన్నారు. మండల స్థాయిలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. విద్యార్థులకు అల్పాహారం కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఢిల్లీకి సొసైటీ చైర్మన్, సీఈఓ

శావల్యాపురం: శావల్యాపురం సొసైటీ ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభించనున్న జనరిక్ మందుల దుకాణాల నిర్వాహణపై కేంద్ర ప్రభుత్వం ఈ నెల 7, 8 తేదీల్లో ఢిల్లీలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించనుంది. ఈ సమావేశాలకు సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య, సీఈఓ జాలాది నాగ ప్రసాదు వెళ్లనున్నారు. ఈ సందర్భంగా గురువారం సీఈఓ ప్రసాదు స్పందిస్తూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో శావల్యాపురం, వేల్పూరు గ్రామాల్లో జనరిక్ మందుల దుకాణాలు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రారంభిస్తారని చెప్పారు. ప్రత్యేక అహ్వానంపై తాము వెళ్తున్నట్లు తెలిపారు.

అనఘాదేవి సామూహిక వ్రతం



వినుకొండ(నూజెండ్ల): విఠంరాజుపల్లి సాయిబాబా దేవస్థానంలో అనఘాదేవి సామూహిక వ్రతం గురువారం ఘనంగా నిర్వహించారు. హిమాలయ గురూజీ పలువురు దంపతులతో వ్రతం చేయించారు. అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పెండేల కాశీ, పుల్లారావు, సురేష్ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకా



బొల్లాపల్లి : మూగచింతలపాలెం సచివాలయం పరిధిలో పశువైద్యాధికారి పి. అమీర్ బాషా పశువిజ్ఞాన బడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. పాడి రైతులకు పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు పంపిణీ చేశారు. పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. 120 గేదెలకు, 30 లేగ దూడలకు గాలికుంటు నివారణ టీకా వేశారు. ఎంపీటీసీ సభ్యుడు కడియం జోజి, సహాయక సిబ్బంది ఏడుకొండలు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



రొంపిచర్ల : మండల కేంద్రంలో గతేడాది నవంబర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన బాధిత కుటుంబానికి గురువారం ఆంధ్రప్రదేశ్ హరిదాసు అభివృద్ధి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. బాధితుడు పంబా వెంకటేశ్వర్లుకు సంఘం అధ్యక్షుడు మెండెం లక్ష్మణ్ రూ.10వేలు నగదు అందించారు. సంఘం నాయకులు నాగమల్లేశ్వరరావు, పంబా వెంకట్ పాల్గొన్నారు.

లక్ష్మీవల్లభ అలంకారంలో శ్రీవారు



సత్తెనపల్లి: ధనుర్మాసంను పురస్కరించుకొని పట్టణంలోని వడ్డవల్లి రామాలయం, వేంకటేశ్వర స్వామి దేవాలయం, రైల్వే స్టేషన్ రోడ్‌లోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయం, ఐదులాంతర్ల సెంటర్‌లోని రుక్మిణి సత్య భామ సమేత వేణు గోపాల స్వామి దేవాలయం, కట్టమూరివారి వీధిలోని కోదండ రామాలయంలో గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. రైల్వే స్టేషన్ రోడ్డులోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారికి లక్ష్మీ వల్లభ అలంకారం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకొన్నారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విశ్వసనీయతకు అండగా నిలవండి

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- పెంచిన రూ.3వేల పింఛను నగదు లబ్ధిదారులకు పంపిణీ



రూ.3వేల పెన్షన్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: అధికారంలోకి వచ్చిన రోజు నుంచి హామీలను అమలుచేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. వైఎస్సార్ పెన్షన్ కానుక వారోత్సవాల్లో భాగంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం పెంచిన పింఛన్ల పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు పింఛను నగదు పంపిణీ అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్రలో పేదలు, వృద్ధులు, వితంతవుల కష్టాలను నేరుగా చూసిన సీఎం వైఎస్ జగన్ పింఛన్‌ను రూ.3వేల వరకు పెంచుతానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. నూతన సంవత్సరం కానుకగా రూ.3 వేల పింఛను నగదు ఇస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 66.34 లక్షల మందికి రూ.3 వేల పింఛనను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. రాష్ట్రంలో అమలుజరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే గోపిరెడ్డి అన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతవులపై అమిత ప్రేమ చూపుతున్న సీఎం వైఎస్ జగన్ గొప్ప మానవతావాది అని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో గెలిచేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలకు తెరతీస్తున్నారని విమర్శించారు. కూటముల పేరుతో ప్రజల ముందుకు రాబోతున్న పార్టీలకు ప్రజలే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఈఎం స్వామి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజావలి, వైస్ ఎంపీపీ వెంకటప్పారెడ్డి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో సంతృప్త స్థాయిలో పింఛన్లు

చిలకలూరిపేట: సీఎం జగనన్న పాలనలో అర్హులందరికీ సంతృప్త స్థాయిలో పింఛన్లు అందజేస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు అన్నారు. మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో చిలకలూరిపేట పట్టణం, రూరల్ లబ్ధిదారులకు రూ.3వేలకు పెంచిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ల మంజూరులో లంచాలు, వివక్ష కొనసాగేవని విమర్శించారు. నేడు ఎవరికీ లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో పింఛన్లు అందుతున్నాయని ఆయన కొనియాడారు. అర్జీ పెట్టుకున్న 21 రోజుల్లో అర్హులకు పింఛన్ కార్డులు మంజూరు చేస్తున్నారన్నారు. పట్టణ పరిధిలో 11,424 మందికి రూ. 3.45కోట్లు, మండలంలో 8, 851 మందికి రూ. 2.63 కోట్లు ఈ నెల పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు సమన్వయకర్త రాజేష్ నాయుడు చెప్పారు. కొత్తగా పట్టణంలో 176 మంది, మండలంలో 151 మంది మొత్తం 327 మందికి పింఛన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, కొమరవల్లిపాడు సొసైటీ అధ్యక్షుడు కొండవీటి ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు క్లస్టర్ -1 పఠాన్ తలహాఖాన్, పార్టీ మండలాధ్యక్షుడు గుత్తా యాములయ్య, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



పింఛను నగదు అందజేస్తున్న సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు

మరోసారి ప్రజల ముందుకు

నాదెండ్ల: గత ఎన్నికల హామీలన్నీ అమలు చేసి, మరోసారి ప్రజల ముందుకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని చిలకలూరిపేట వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వైఎస్సార్ పెన్షన్ కానుక, సామాజిక భద్రతా పింఛన్లు ఆయన పంపిణీ చేశారు. జనవరికి పెరిగిన రూ.3 వేలు పింఛను అందించారు. మండల పరిధిలో ప్రస్తుతం 9,630 మంది పింఛనుదారులు ఉన్నారని, 170 మందికి నూతన పింఛన్లు ఇచ్చినట్లు తెలిపారు. వీరికి ప్రతి నెలా రూ.2,43,99,300లు అంఇస్తున్నట్లు రాజేష్ నాయుడు తెలిపారు. నాదెండ్ల గ్రామంలో రూ.6 కోట్ల వ్యయంతో పెద్దాసుపత్రి నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. గత ప్రభుత్వం పేదవాడికి సెంటు స్థలం కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ షేక్ జాకీర్ హుస్సేన్, ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్ రావు, పార్టీ మండలాధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, గణపవరం, నాదెండ్ల సొసైటీల అధ్యక్షులు మంగు ఏడుకొండలు, కె.వెంకటరెడ్డి, జగనన్న సురక్ష కన్వీనర్ ఎ.రవికుమార్ పాల్గొన్నారు.

అయోధ్య రామమందిరం అక్షింతలు పంపిణీ



అక్షింతలు పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

చిలకలూరిపేటటౌన్: అయోధ్య రామ మందిరం అక్షింతలు, ప్రారంభోత్సవ వివరాల కరపత్రాలు పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో వెంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తలు, ప్రసన్నాంజనేయస్వామి ఆలయ కమిటీ సంయుక్తంగా ఇంటింటికీ తిరిగి పంపిణీ చేస్తున్నారు. ఆయా కమిటీ సభ్యులు మాట్లాడుతూ అక్షింతలను స్వీకరించిన భక్తులు విధిగా వాటిని తమ ఇళ్లల్లోని పూజా మందిరంలో ఉంచి, ఈ నెల 22న రామమందిరం ప్రారంభోత్సవం నిర్వహించిన తర్వాత ఇంట్లో ఐదు దీపాలను వెలిగించి, కుటుంబ సభ్యులంతా తలపై చల్లుకోవాలని సూచించారు. అనంతరం సీతారాముల ఉత్సవ విగ్రహాలతో వీధుల్లో రామనామాన్ని జపిస్తూ పర్యటించారు.

నేత్ర వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

యడ్లపాడు: నాణ్యమైన కంటి వైద్య సేవలను అందిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పేదలంతా సద్వినియోగం చేసుకోవాలని కంటి వైద్య నిపుణుడు డాక్టర్ రామలింగారెడ్డి అన్నారు. మాక్సీ విజన్ కంటి ఆసుపత్రి, మాజీ ఎంపీపీ ఎంవీ బాలచంద్రారెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. సొలస గ్రామంలో డాక్టర్ మాలపాటి చెంచురెడ్డి, ఆప్త మాలజీ వైద్యులు సమీప గ్రామాలకు చెందిన 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మరో 36 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ప్రతి సోమవారం ఆపరేషన్లకు ఎంపిక చేసిన వారిని ప్రత్యేక వాహనంలో ఆస్పత్రికి తీసుకెళ్లి.. శస్త్ర చికిత్స చేయనున్నట్లు ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల క్యాంపు కో-ఆర్డినేటర్ వీరయ్య తెలిపారు. సహకరించిన గ్రామ పెద్దలు పాలూరి శ్రీనివాసరెడ్డి, మద్దూరి సంజీవరెడ్డి, వైఎస్సార్ యూత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పాస్టర్ దుర్మరణం



పాస్టర్ బిరుదు భూపతిరాజు (ఫైల్)

నాదెండ్ల: రోడ్డు ప్రమాదంలో పాస్టర్ దుర్మరణం చెందిన ఘటన జాతీయ రహదారిపై గణపవరం పాత టీబీ హాస్పిటల్ వద్ద బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. నాదెండ్ల ఎస్సై జె.బలరామ్‌రెడ్డి వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణానికి చెందిన బిరుదు భూపతిరాజు (32) చర్చిలో పాస్టర్‌గా పనిచేస్తున్నాడు. గుంటూరులోని తన మిత్రుడిని కలిసేందుకు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో టీబీ హాస్పిటల్ వద్దకు వచ్చేసరికి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో.. ప్రమాదానికి గురయ్యాడు. తలకు హెల్మెట్ ఉన్నప్పటికీ తీవ్రగాయాలైన భూపతిరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించిన పోలీసులు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం బంధువులకు అప్పగించారు. భార్య బండారు సోనియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. వీరికి ఏడాదిన్నర వయస్సు గల కుమార్తె ఉంది.

అనుమానాస్పద మృతి కేసు నమోదు

నరసరావుపేట టౌన్: వ్యక్తి మృతిపై అనుమానస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ అశోక్ కుమార్ గురువారం తెలిపారు. లక్నోకు చెందిన సయ్యద్ వసీ(65) రామిరెడ్డిపేటలోని ఓ అద్దె గృహంలో నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతను నివసిస్తున్న ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ రహంతుల్లా ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. వసీ మృతి చెంది కనిపించాడు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు నాలుగు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఈ మేరకు ఇంటి యజమాని పాలడగు రత్నకుమారి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పేదవాడి ఆకలి తీర్చడమే లక్ష్యం

- సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు
- జగనన్న ఉచిత భోజన క్యాంటీన్ ప్రారంభం



జగనన్న ఉచిత భోజన క్యాంటీన్ ప్రారంభిస్తున్న మల్లెల రాజేష్‌నాయుడు

చిలకలూరిపేట: పేదల కష్టాలు తెలిసిన సంక్షేమ ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో పేదవాడి ఆకలి తీర్చడమే లక్ష్యంగా జగనన్న ఉచిత భోజన క్యాంటీన్ ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు తెలిపారు. పట్టణంలోని కేబీ రోడ్డులో సుభాని నగర్ వద్ద జగనన్న ఉచిత భోజన క్యాంటీన్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. జగనన్న బాటలో పయనిస్తూ.. పేదల కోసం క్యాంటీన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిరుపేదలు ఆకలితో అలమటించకూడదన్న లక్ష్యంలో క్యాంటీన్ ప్రారంభించినట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, మాజీ అధ్యక్షుడు ఏవీఎం సుభాని, మైనార్టీ విభాగం అధ్యక్షుడు బేరింగ్ మౌలాలి, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు బక్షు మేస్త్రి, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పట్టణంలోని 27వ వార్డు పరిధిలోని విందు రెస్టారెంట్ పక్కన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులు రూ. 13.27 లక్షలతో సీసీ కల్వర్టు, డ్రెయిన్ల నిర్మాణానికి గురువారం సమన్వయకర్త మల్లెరాజేష్ నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్ అన్నపరెడ్డి శ్రీలక్ష్మి, కో-ఆప్షన్ సభ్యుడు బక్షు మేస్త్రి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని మల్లెల రాజేష్‌నాయుడు చెప్పారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులతో ఆయన గురువారం మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో కార్మికులు ధర్నా విరమించారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..!



సత్తెనపల్లి: సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు గురువారం పట్టణంలోని 28వ వార్డులో నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా హాజరై వివిధ రంగులతో కూడిన రంగవల్లులు తీర్చిదిద్దారు. మొత్తం 92 మంది మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. వార్డులోని సీసీ రోడ్లు రంగవల్లులతో నిండిపోయాయి. ముగ్గులను వార్డు కౌన్సిలర్ తాహెరున్నీసా పరిశీలించారు. వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతాహాసంతి నేతృత్వంలో న్యాయ నిర్ణేతలు ముగ్గులను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. వార్డు స్థాయి ముగ్గుల పోటీల్లో తల్లం గురుప్రసన్నలక్ష్మీ(ప్రథమ స్థానం), బాదం హారిక (ద్వితీయస్థానం), తల్లం నాగ రాజకుమారి(తృతీయస్థానం), ముసుగు తిరుపతమ్మ(నాలుగో స్థానం), ఎం.పద్మావతి (5వ స్థానం) కైవసం చేసుకున్నారు.

రోడ్డుపై మృతుని బంధువుల ధర్నా

ముప్పాళ్ళ: మినీలారీ ఢీ కొన్న ప్రమాదంలో చనిపోయిన మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ మృతదేహాన్ని పోలీస్‌స్టేషన్ వద్ద ఉంచి మృతుని బంధువులు ఆందోళనకు దిగిన ఘటన గురువారం జరిగింది. వివరాల మేరకు.. ముప్పాళ్ళ ముస్లిం కాలనీకి చెందిన షేక్ మన్సూర్‌వలి మినీలారీ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన సంఘటన తెలిసిందే. ఈ ప్రమాదానికి కారణమైన వ్యక్తిని వదిలిపెట్టారంటూ మృతుని బంధువులు పోలీస్‌స్టేషన్ ముందు బైఠాయించారు. మృతుని కుటుంబానికి న్యాయం చేసేవరకు కదిలేది లేదంటూ ముప్పాళ్ళ పోలీస్‌స్టేషన్ ఎదురుగా సత్తెనపల్లి- నరసరావుపేట ప్రధాన రహదారిపై బైఠాయించి నినాదాలు చేశారు. పెద్దఎత్తున ముస్లిం మహిళలు, యువకులు రావటంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దాదాపు గంటన్నర గంటల పాటు రోడ్డు పై బైఠాయించటంతో భారీ ఎత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడటంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి మృతుని బంధువులతో మాట్లాడి ఆందోళనను విరమింపచేశారు. మృతుని కుటుంబానికి నష్టపరిహారంగా రూ.2.5లక్షలు అందించేలా అంగీకరించటంతో ఆందోళనను విరమించారు.

మూడో రోజు పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: పారిశుద్ధ్య కార్మికుల సమ్మెను దృష్టిలో పెట్టుకొని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో మూడవ రోజు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. క్రిస్టియన్‌పాలెం, శివ సంజీవయ్య కాలనీ, డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రోడ్లను శుభ్రం చేశారు. అనంతరం గుంటూరు రోడ్డు నుంచి చిలకలూరిపేట రోడ్డుకు వెళ్లే ప్రాంతంలో డంపింగ్ యార్డును పరిశీలించారు. యార్డులోని చెత్తకు రెండు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. పొగ తీవ్రత ఎక్కువ ఉండటంతో అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది, పురపాలక శాఖ సిబ్బంది కలిసి మంటలు అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ పనులను పరిశీలించి, పరిస్థితిపై అధికారులతో మాట్లాడారు. ఈ పొగ వల్ల వాహనదారులకు, ప్రయాణికులకు ఆటంకం కలగకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గోపిరెడ్డి కోరారు. మున్సిపల్ ఎంఈ బి.కనకారావు, డీఈ ఓలేటి శ్రీనివాసరావు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల ఎజ్రా, ఎస్సీ మానిటరింగ్ సెల్ జిల్లా సభ్యుడు మల్లెల అశోక్, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్ మహబూబు బాష, రొంపిచర్ల ఎస్సీ నాయకుడు గుండాల వెంకటేష్, క్రిస్టియన్‌పాలెం నాయకులు ఆయన వెంట ఉన్నారు.

నేటి నుంచి ఈవీఎంపై అవగాహన సదస్సులు



ఈవీఎంపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దారు నాగరాజు

శావల్యాపురం: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం(ఈవీఎం)పై గ్రామాల వారీగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తహసీల్దారు వేముల వెంకట నాగరాజు అన్నారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఈవీఎం పనితీరుపై వీఆర్వోలకు అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ ఈవీఎం ద్వారా ఓటింగ్ విధానం, బ్యాలెట్, కంట్రోలు యూనిట్, వీవీ ప్యాట్‌పై పూర్తిస్థాయిలో ఓటర్లకు అవగాహన కల్పించడానికి చర్యలు చేపట్టామన్నారు. తొలిరోజు శావల్యాపురం, కనమర్లపూడి గ్రామ సచివాలయాలు, ఈ నెల 6న కొత్తలూరు, పోట్లూరు, ఇర్లపాడు, 8న వేల్పూరు, గంటావారిపాలెం, 9న శానంపూడి, ముండ్రువారిపాలెం, చినకంచర్ల, 10న బొందిలిపాలెం, మతుకుమల్లి, 11న కారుమంచి, గుంటుపాలెం, చివరి రోజు 12న పిచికలపాలెంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణలో ఈవీఎంపై అవగాహన సదస్సులు జరుగుతాయని తెలిపారు. డిప్యూటీ తహసీల్దారు పేరుసోముల నాసరయ్య, వీఆర్వోలు ఉప్పుటూరి మంగయ్య, వీరవల్లి నాగ సంతోషలక్ష్మి, రాధ, అమల పాల్గొన్నారు.

ఏఎన్‌యూ క్రికెట్ జట్టుకు కేబీఆర్ కళాశాల విద్యార్థి ఎంపిక



నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రికెట్ జట్టుకు కాసు బ్రహ్మానందరెడ్డి డిగ్రీ కళాశాల విద్యార్థి షేక్.మహ్మద్ తౌఫిక్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్.వి.నాగిరెడ్డి గురువారం తెలిపారు. వర్సిటీ క్రీడా మైదానంలో డిసెంబర్ 28 నుంచి ఈ నెల 3వ తేదీ వరకు నిర్వహించిన జట్టు ఎంపికలో తౌఫిక్ ప్రతిభ కనపరిచారన్నారు. ఈ నెల 7 నుంచి చెన్నైలోని హిందుస్థాన్ ఇంజినీరింగ్ కళాశాలలో జరగనున్న సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల క్రికెట్ టోర్నమెంట్‌లో తౌఫిక్ ఏఎన్‌యూ జట్టు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. తౌఫిక్‌ను కళాశాల కార్యదర్శి, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ప్రిన్సిపల్ నాగిరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఎ.వెంకటశివ, వ్యాయామ అధ్యాపకుడు ఎం.వినీల్, అధ్యాపకులు అభినందించారు.

కార్పొరేట్‌కు దీటుగా సర్కార్ బడుల్లో వసతులు

- చిలకలూరిపేట వైఎస్సార్ సీపీ సమన్వయకర్త రాజేష్ నాయుడు
- పాఠశాలల్లో జగనన్న విద్యా జ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ



గణపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

నాదెండ్ల: రాష్ట్రంలో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చిలకలూరిపేట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు అన్నారు. చిరుమామిళ్ల ఏపీ మోడల్ స్కూల్లో గురువారం పదో తరగతి విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక పాఠశాల గతేడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 96 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ ఝాన్సీవాణి, సర్పంచ్ సింగారెడ్డి లక్ష్మీ, ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ మస్తాన్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు కోటిరెడ్డి, సింగారెడ్డి కోటిరెడ్డి పాల్గొన్నారు.

విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ

ఈపూరు : కొచ్చర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్స్‌ను సర్పంచ్ కోపెల దేవరాజ్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాజ్యోతి పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోలి ఏడుకొండలు, స్కూల్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్స్‌ను మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు గురువారం పంపిణీ చేశారు. ప్రతి ఏడాది జెడ్పీ నిధులతో స్టడీ మెటీరియల్ అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గణపవరం పాఠశాల పెద్ద పాఠశాల అని సుమారు ఇక్కడ 1,200 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారన్నారు. ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించి పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు పేరు తేవాలని కోరారు. హెచ్‌ఎం కృష్ణానాయక్, ఇన్‌చార్జి హెచ్‌ఎం ఉషారాణి, పీఎంసీ చైర్మన్ సూరా శంకరరెడ్డి, వైస్ చైర్మన్ రసూల్‌బీ పాల్గొన్నారు.

వినుకొండ(నూజెండ్ల) : సీతారామపురం కమిటీ హైస్కూల్లో విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను గురువారం హెచ్‌ఎం కామేశ్వర శర్మ విద్యార్థులకు పంపిణీ చేశారు. నూజెండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్టడీ మెటీరియల్‌ను పీఎంసీ చైర్మన్ వంగూరి ప్రసాద్ పంపిణీ చేశారు. హెచ్‌ఎం. వి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొల్లాపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పదో తరగతి విద్యార్థులకు గురువారం పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు కె అపర్ణ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని, ఉత్తీర్ణత శాతం పెంచుకోవాలని సూచించారు. సర్పంచ్ శిఖా జోత్స్న, తల్లిదండ్రుల కమిటీ మెంబర్లు సీహెచ్ లక్ష్మి, కె. రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **శావల్యాపురం:** స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయురాలు బి.వి జయలక్ష్మి విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి మెటీరియల్స్ పంపిణీ చేశారు. సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, బెజవాడ ట్రస్టు అధ్యక్షుడు బెజవాడ నాగేశ్వరరావు, కో-ఆప్షన్ సభ్యులు దూదెకుల హుస్సేన్, వైఎస్సార్ సీపీ నేతలు చిట్టేటి రవి, పాట్టిపాటి శ్రీను, ముట్లూరి సత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటు నమోదుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది

యడ్లపాడు: కారుచోల గ్రామంలో గురువారం ఈవీఎం, వీవీ ప్యాడ్‌లపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం జరిగింది. స్థానిక 108, 109, 110 పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఈవీఎం పనితీరు, ఓటు వేసే విధానాన్ని రెవెన్యూ సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మోజేస్, వీఆర్వో వై.నాగేంద్రబాబు, పంచాయతీ కార్యదర్శి పి.అంకయ్య పాల్గొన్నారు.